సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 5 । నవంబర్ । 2023



జూలో ఐఎఫ్ఎస్ ట్రైనర్లు
జూ పార్కును ఇందిరాగాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐఎఫ్ఎస్ ట్రైనర్లు సందర్శించారు. 8లో



తైక్వాండో పోటీలకు ఎంపిక
రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు అండర్–17 కేటగిరీ విభాగంలో 26 మంది బాల, బాలికలను ఎంపిక చేశారు. 8లో



అదిరే.. అదిరే
బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 8లో

న్యూస్‌రీల్

21 వైద్య శిబిరాల్లో 10,454 మందికి సేవలు



మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా శనివారం 21 ప్రాంతాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 10,454 మందికి సేవలందించినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. నగరంలో పలు చోట్ల జరిగిన శిబిరాలను ఆయన సందర్శించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి పాల్గొన్నారు.

నేడు మంత్రి రజని రాక



మహారాణిపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఆదివారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 11.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటా రు. అక్కడ నుంచి నేరుగా వెళ్లి మహారాణిపేటలోని బ్రాహ్మకుమారీస్ కార్యక్రమంలో పాల్గొంటారు. 3.20 గంటలకు కప్పరాడలో యూపీహెచ్‌సీ, 4.15 గంటలకు గోపాలపట్నం రైతుబజార్ పక్కన పునర్‌నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ), 5 గంటలకు చంద్రనగర్‌లో యూపీహెచ్‌సీని ప్రారంభిస్తారు. అక్కడ నుంచి విమానాశ్రయానికి చేరుకుని విజయవాడ వెళ్తారు.

శబరిమలకు ఆర్టీసీ బస్సులు



దాబాగార్డెన్స్ : శబరిమలకు వెళ్లే అయ్యప్పస్వామి భక్తులకు ఏపీఎస్ఆర్టీసీ బస్సులు నడుపుతుందని ప్రజా రవాణా అధికారి అప్పలరాజు పేర్కొన్నారు. 5, 6, 7 రోజుల ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఒడిశాలోని నవరంగపూర్, కోరాపుట్, జైపూర్ తదితర ప్రాంతాలకు కూడా ఆర్టీసీ విశాఖ రీజియన్ బస్సులు పంపుతుందని చెప్పారు. ఈ ఏడాది స్వాముల కోసం అమరావతి, ఇంద్ర, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

7న జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీలు

గాజువాక : జిల్లా విద్యాశాఖ, రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2023 జిల్లా స్థాయి పోటీలను ఈ నెల 7న నిర్వహించనున్నట్టు జిల్లా కో ఆర్డినేటర్ పి.రాజారావు తెలిపారు. ఈ పోటీలు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి బాలశాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. ఒక ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌తోపాటు ఇద్దరు విద్యార్థులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఈ పోటీల్లో ఏడు ప్రాజెక్టులను ఎంపిక చేసి ఈనెల 29, 30 తేదీల్లో విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. వివరాలకు 9490662662 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆర్కిటెక్ట్‌ల భాగస్వామ్యం అవసరం

బీచ్‌రోడ్డు: రాష్ట్ర సృజనాత్మక అభివృద్ధిలో ఆర్కిటెక్ట్‌ల భాగస్వామ్యం అవసరమని పలువురు వక్తలు అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆర్కిటెక్చర్ మీట్ జరిగింది. సంవాద్ ఇన్ ఆర్కిటెక్చర్ అంశంపై సాగిన మీట్‌లో ప్రపంచాన్ని మలచడంలో వాస్తు శిల్పుల పాత్ర గురించి వక్తలు వివరించారు. సస్టైయినబిలిటీ, పారామెట్రిక్ డిజైన్, గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

జంక్షన్లు జిగేల్

- వినూత్నంగా ప్రధాన కూడళ్లు
- ఆకట్టుకుంటున్న కళాకృతులు



రైల్వే న్యూకాలనీ కూడలిలో ఆకర్షిస్తున్న రైలింజిన్ ఫౌంటెన్

దాబాగార్డెన్స్: విశాఖ నగరం అభివృద్ధిలో కొంతపుంతలు తొక్కుతోంది. కూడళ్లు ఆహ్లాదానికి నిలయంగా మారుతున్నాయి. అదనపు హంగుల కోసం వినూత్నంగా.. వివిధ డిజైన్లతో కళాకృతులు తీర్చిదిద్దుతున్నారు. విద్యుత్ దీపాల ధగధగలు.. వాటర్ ఫౌంటెన్లతో జంక్షన్లు కొత్త శోభను సంతరించుకుంటున్నాయి. అటుగా ప్రయాణించే వాహనచోదకులను ఇట్టే ఆకర్షిస్తున్నాయి.

విశాఖ మహా నగరంలో సుందరీకరణ పనులు ఊపందుకున్నాయి. నగరాన్ని కొత్తగా చూపేందుకు జీవీఎంసీ వినూత్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఓ వైపు రోడ్లను విస్తరిస్తోంది. మరో వైపు కొత్త రోడ్లు వేస్తోంది. పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతోంది. పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు బీచ్‌లను సుందరీకరిస్తోంది. బీచ్‌లను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక వాహనాలను



ఎండాడ కూడలిలో వినూత్న కళాకృతి

వినియోగిస్తోంది. ఈ క్రమంలో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని జంక్షన్ల ఆధునికీకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. కూడళ్ల వద్ద వాహనాలు సాఫీగా మలుపులు తిరిగేలా విస్తరిస్తున్నారు. జంక్షన్ల మధ్య వలయాకార భాగాల్లో గ్రీనరీ, వివిధ రకాల కళాకృతులు, ఫౌంటెన్లు ఏర్పాటు చేస్తున్నారు. పాదచారులు సులభంగా రోడ్డు దాటేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యుద్దీపాల ధగధగలతో జంక్షన్లు రాత్రిళ్లు మెరిసిపోయేలా తీర్చిదిద్దుతున్నారు.



జగదాంబ జంక్షన్‌లో క్లాక్‌టవర్

స్మార్ట్‌సిటీ నిధులు రూ.2.3 కోట్లతో జగదాంబ జంక్షన్‌ను అత్యాధునికంగా అభివృద్ధి చేస్తున్నారు. తెన్నేటి విశ్వనాథం పార్క్‌లో జంక్షన్‌కు నాలుగు వైపులా కనిపించేలా 20 మీటర్ల ఎత్తులో క్లాక్ టవర్ ఏర్పాటు చేయనున్నారు. చుట్టూ గ్రీనరీ, వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. అక్కడి నుంచి లేపాక్షి జంక్షన్ వరకు గ్రీనరీ ఏర్పాటు చేయనున్నారు. తద్వారా జగదాంబ జంక్షన్ కొత్త శోభను సంతరించుకోనుంది.

- స్మార్ట్‌సిటీ నిధులు రూ.85 లక్షలతో రైల్వే న్యూకాలనీ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన రైలింజన్ ఫౌంటెన్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. రైలింజన్ చుట్టూ అధునాతన పేమెంట్ టైల్స్, ఐ లవ్ వైజాగ్ ఏర్పాటు చేసి అదనపు హంగులు సమకూర్చారు. రూ.1.29 లక్షలతో ఎంవీపీ జంక్షన్, రూ.96 లక్షలతో అక్కయ్యపాలెం జంక్షన్, రూ.76 లక్షలతో కైలాసగిరి జంక్షన్ల ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.



15వ ఆర్థిక సంఘం నిధులతో జోన్ల వారీగా జంక్షన్ల అభివృద్ధి ఇలా..

జోన్	జంక్షన్లు	నిధులు
జోన్–2	5	రూ.2.32 కోట్లు
జోన్–3	3	రూ.1.20 కోట్లు
జోన్–5బి	2	రూ.1.33 కోట్లు
జోన్–6	5	రూ.2.29 కోట్లు
జోన్–8	1	రూ.35 లక్షలు
మొత్తం	16	రూ.7.49 కోట్లు

స్మార్ట్ సిటీ నిధులతో జంక్షన్ల అభివృద్ధి ఇలా..

జంక్షన్	నిధులు
జగదాంబ	రూ.2.30 కోట్లు
ఎంవీపీ	రూ.1.29 కోట్లు
రైల్వేన్యూకాలనీ	రూ.85 లక్షలు
అక్కయ్యపాలెం	రూ.96 లక్షలు
కైలాసగిరి	రూ.76 లక్షలు

ఎక్కడెక్కడ అంటే..

జోన్–2: 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.32 కోట్లతో కొమ్మాది జంక్షన్, లా కాలేజ్, ఎండాడ జంక్షన్, డెయిరీ ఫాం జంక్షన్, హనుమంతవాక జంక్షన్లను తీర్చిదిద్దుతున్నారు.
జోన్–3: 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.40 లక్షలతో గురుద్వార జంక్షన్, రూ.35 లక్షలతో ఉషోదయ జంక్షన్, రూ.45 లక్షలతో కురుపాం జంక్షన్లను ఆధునికీకరిస్తున్నారు.
జోన్–5బి: రూ.1.33 కోట్లతో ఆర్ అండ్ బీ జంక్షన్, కాకానినగర్ జంక్షన్ల అభివృద్ధి...
జోన్–6: గాజువాక జంక్షన్ పనులు పూర్తయ్యాయి. లంకెలపాలెం జంక్షన్‌ను అభివృద్ధి చేయనున్నారు.
జోన్–8: 35 లక్షలతో సింహాచలం జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.

విశాఖను గొప్పగా అభివృద్ధి చేస్తున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విశాఖ నగరాన్ని గొప్పగా అభివృద్ధి చేస్తున్నాం. ప్రజా సంక్షేమంతో పాటు కోట్లాది రూపాయలు వెచ్చించి నగర వ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ప్రధాన కూడళ్లు, ఐలాండ్‌లను అత్యాధునికంగా అభివృద్ధి చేస్తున్నాం. జంక్షన్ల మధ్య వలయాకార భాగాల్లో గ్రీనరీ, పలు కళాకృతులు, ఫౌంటెన్లు ఏర్పాటు చేస్తున్నాం. ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న దృష్ట్యా రోడ్లను విస్తరిస్తున్నాం. ఆహ్లాదకరంగా పార్కులను తీర్చిదిద్దుతున్నాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

- ఆనందపురంలో వైఎస్సార్ మహిళా మార్ట్ ప్రారంభం
- ఆసరా, చేయూత పథకాల తోడ్పాటుతో మార్ట్‌ల ఏర్పాటు
- కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి



సరకులు కొనుగోలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం : వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ల ఏర్పాటుతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశం కలుగుతుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. శనివారం ఆనందపురం మండల కేంద్రంలో రూ.76.90 లక్షలతో కొత్తగా నిర్మించిన జిల్లాలో మొదటి వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్రతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 44 మహిళా మార్టులను ప్రారంభించగా ఇది 45వదని, జిల్లాలో మొదటదని అన్నారు. ఈ మహిళా మార్ట్ ద్వారా మండలంలోని ప్రజలందరికీ నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రతి ఒక్క సభ్యురాలిని మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. మహిళలకు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ ఇలా పలు పథకాలను అందించడంతో పాటు బ్యాంక్‌లను అనుసంధానం చేస్తూ స్త్రీనిధి, జగనన్న తోడు రుణాలను అందిస్తున్నామన్నారు. జిల్లాలోనే మొదటి మహిళా మార్ట్‌ను ఆనందపురంలో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆనందపురం మండలంలోని 1,552 సంఘాల్లో ఉన్నటువంటి 15,659 మంది మహిళలకు ఇది ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ దేశంలో మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా అంటే అది కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. ఈ రోజు మహిళకంటూ ప్రత్యేక గుర్తింపు గౌరవం ఆయన వల్లే లభిస్తుందన్నారు. డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, చేయూత (సెర్ప్) ఏడీ ఎం.మహిత, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, తహసీల్దారు లోకవరపు రామారావు, ఎంపీడీవో అడపా లవరాజు, స్థానిక సర్పంచ్‌లు లొడగల రాజేశ్వరి, చందక లక్ష్మి, వైఎస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు రౌతు శ్యామల, కొట్టాడ రమాదేవి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మీసాల లక్ష్మి, మార్ట్ అధ్యక్షురాలు బుంగ రమ, నాయకులు చందక సూరిబాబు, పిన్నింటి వెంకటరమణ, కాకర వెంకట రమణ, లెంక రాంబాబు, లవ్ అండ్ కేర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు యేసుపాదం, ఏపీఎం నాగభూషణరావు పాల్గొన్నారు.

వీఐసీటీలో మౌలిక సదుపాయాలు పెంచాలి

అధికారులకు పోర్టు చైర్మన్ డా.అంగముత్తు ఆదేశం

సాక్షి, విశాఖపట్నం : అంతర్జాతీయ పర్యాటకులకు అనుగుణంగా విశాఖపట్నం ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్(వీఐసీటీ)లో మౌలిక సదుపాయాలు పెంచాలని అధికారులను పోర్టు చైర్మన్ డా.అంగముత్తు ఆదేశించారు. పోర్టులో ఇటీవలే ప్రారంభించి క్రూయిజ్ టెర్మినల్ భవనాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా టెర్మినల్ భవనంలో ఏర్పాటు చేయాల్సిన మౌలిక సాకర్యాలు, టూరిస్టులకు అవసరమైన వ్యవస్థలకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని ఆదేశించారు. తూర్పు తీరంలో ఉన్న ఏకైక క్రూయిజ్ టెర్మినల్ కావడం వల్ల.. దీనిని ప్రపంచ పర్యాటకుల్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. టెర్మినల్‌ని మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యల్ని వెంటనే చేపట్టాలని స్పష్టం చేశారు. ఆయన వెంట సెక్రటరీ వేణుగోపాల్, ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్ తదితరులున్నారు.

వెబ్‌సైట్‌లో స్టాఫ్ నర్సు ఉద్యోగాల మెరిట్ లిస్టు

మహారాణిపేట : స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు సంబంధించి ఫైనల్ మెరిట్ లిస్టును వెబ్‌సైట్‌లో పెట్టారు. ప్రొవిజినల్ మెరిట్ జాబితాపై దాదాపు 200 పైగా అభ్యంతరాలు వచ్చాయి. వీటిని పరిశీలించి ఫైనల్ మెరిట్ జాబితాను సిద్ధం చేసి, http://cfw.ap.nic.inలో అప్‌లోడ్ చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత తెలిపారు. త్వరలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఇతర ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు.

బిహార్ గవర్నర్ రాక రేపు

మహారాణిపేట: విశాఖలో రెండు రోజుల పర్యటన నిమిత్తం బిహార్ గవర్నర్ ఎ.రాజేంద్ర విశ్వనాథ్ ఈనెల 6న విశాఖ వస్తున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2.25 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.05 గంటలకు ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకొని విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వెళ్తారు. రాత్రి సర్క్యూట్ హౌస్‌లో బస చేస్తారు.

7న హోటల్ దసపల్లాలో జరగనున్న యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు కురుసురా సబ్ మెరైన్‌ను తిలకిస్తారు. 8న ఉదయం 7.40 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి విమానంలో చెన్నై వెళ్తారు.

ఐఆర్‌సీటీసీ విమాన ప్యాకేజీ

తాటిచెట్లపాలెం: పర్యాటకుల కోసం ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) విశాఖపట్నం నుంచి ప్రత్యేక ఫ్లైట్ టూర్ ప్యాకేజీని ప్రకటించింది. ఐఆర్‌సీటీసీ, సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ బిసా శనివారం వాటి వివరాలు తెలిపారు.

సిక్కిం–గాంగ్‌టక్–డార్జిలింగ్–కలింపాంగ్ (6రాత్రులు, 7పగళ్లు)

ఈ టూర్ ఈ నెల 28న విశాఖ ప్రారంభమై, డిసెంబరు 4వ తేదీన విశాఖలోనే ముగుస్తుంది. టూర్‌లో భాగంగా గాంగ్‌టక్‌లోని సోంగో సరస్సు, హర్భజన్‌సింగ్ మెమోరియల్, నాథులా పాస్ ఇండియా, డార్జిలింగ్‌లోని ట్రో డుల్ చోర్టెన్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టిబెటాలజీ, హిమాలయన్ మౌంటినీరింగ్ ఇన్‌స్టిట్యూట్, పీఎన్ జూలాజికల్‌పార్క్, టింజింగ్ రాక్, టిబెటిన్ శరణార్థుల సహాయక కేంద్రం, కలింపాంగ్‌లోని మంగళ్ ధాం, దేవ్‌లో హిల్, డాక్టర్ గ్రాహం నివాసం, దర్బిన్ దారా హిల్స్, పలు పూల తోటలను సందర్శించవచ్చు. ఈ టూర్‌లో ఒకొక్కరికి సింగిల్ ఆక్యుపెన్సీ బస అయితే రూ.61,900, డబుల్ ఆక్యుపెన్సీ రూ.49,880, త్రిపుల్ ఆక్యుపెన్సీ రూ. 48,180 (అన్ని పన్నులు, జీఎస్టీతో కలిపి)గా నిర్ణయించారు.

యాత్రల వివరాలు...

- యాత్రికులు ఎంచుకున్న ఆక్యుపెన్సీ (సింగిల్/డబుల్/త్రిపుల్) రూంను బట్టి చార్జీ వసూలు చేస్తారు.
- ఇండిగో ఎయిర్‌లైన్, ఎకానమి క్లాస్‌లో విమాన ప్రయాణం
- రాత్రి వేళ 3 స్టార్ హోటల్స్‌లో బస
- విశాఖలో ప్రారంభం మొదలు ఎయిర్‌పోర్ట్ పికప్, డ్రాపింగ్, సైట్ సీయింగ్ అన్ని ఏసీ వాహనాల్లోనే..
- విశాఖ నుంచి అనుభవజ్ఞులైన ఐఆర్‌సీటీసీ టూర్ మేనేజర్
- ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం
- ఈ యాత్రకు సంబంధించి మరిన్ని వివరాలకు విశాఖ రైల్వేస్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ, చందన్‌కుమార్ – 82879 32318, సాయిప్రసాద్ – 92814 95847, ఆఫీస్ – 0891–2500695 నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ సూచించారు.

ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం రద్దీ మార్గాల్లో వయా దువ్వాడ మీదుగా పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(06073) స్పెషల్ రైలు చెన్నై సెంట్రల్‌లో ఈ నెల 13,20,27వ తేదీల్లో (సోమవారాల్లో) రాత్రి 11.45గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.15గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 11.20గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 6.30గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో భువనేశ్వర్–చెన్నై సెంట్రల్ (06074) స్పెషల్ భువనేశ్వర్‌లో ఈనెల 14,21,28 తేదీల్లో (ప్రతీ మంగళవారాల్లో) రాత్రి 9గంటలకు బయల్దేరి తెల్లవారు 3.45గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 3.50గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 3 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.
- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–సంత్రగచ్చి (06071) స్పెషల్ రైలు చెన్నై సెంట్రల్‌లో ఈ నెల 11,18,25వ తేదీల్లో (శనివారాల్లో) రాత్రి 11.45గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.15గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 11.17గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 3.45గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో సంత్రగచ్చి –చెన్నై సెంట్రల్ (06072) స్పెషల్ సంత్రగచ్చిలో ఈనెల 13,20,27 తేదీల్లో ప్రతి సోమవారం తెల్లవారు 5గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.50గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 8.52గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటాయి.
- సూరత్–బ్రహ్మపూర్ (09069) స్పెషల్ సూరత్‌లో ఈ నెల 8,15,22,29 డిసెంబరు 6,13,20,27 తేదీ (ప్రతీ బుధవారాల్లో) మధ్యాహ్నం 2.20గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 8.10గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 8.12గంటలకు బయల్దేరి గురువారం అర్ధరాత్రి 1.15గంలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో బ్రహ్మపూర్–సూరత్ (09070) స్పెషల్ ఈ నెల 10,17,24, డిసెంబరు 1,8,15,22,29వ తేదీ (శుక్రవారాల్లో) తెల్లవారు 3.30గంలకు బయల్దేరి ఉదయం 8.20 గంటలకు చేరుకుని అక్కడ నుంచి 8.22గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.45 గంటలకు సూరత్ చేరుకుంటుంది.

జూని సందర్శించిన ఐఎఫ్ఎస్ ట్రైనర్లు

ఆరిలోవ : జూ పార్కును డెహ్రాడూన్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐఎఫ్ఎస్ ట్రైనర్లు శనివారం సందర్శించారు. దక్షిణ భారత పర్యటనలో భాగంగా ఈ బృందం జూ పార్కుకు చేరుకున్నారు. వన్య ప్రాణుల సంరక్షణ, ఎన్‌క్లోజర్లు, వృక్షాలను పరిశీలించారు. జూ క్యూరేటర్ నందనీ సలారియా వారికి జూ నిర్వహణ, వన్య ప్రాణులు, వాటికి అందించే ఆహారం, అలవాట్లు, ఆరోగ్యం, వైద్య సేవలు, తదితర వాటి గురించి వివరించారు. జూలో నిర్వహిస్తున్న వైల్డ్ డాగ్ బ్రీడింగ్ సెంటర్ గురించి తెలిపారు. కార్యక్రమంలో జూ డీసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు 26 మంది ఎంపిక

మధురవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు అండర్–17 కేటగిరీ విభాగంలో 26 మంది బాల, బాలికలను ఎంపిక చేశారు. ఈ నెల 9 నుంచి 11 వరకు వైఎస్సార్ కడప జిల్లా కోడూరులో ఈ పోటీలు జరగనున్నాయి. జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడే జట్ల ఎంపిక శుక్రవారం మధురవాడ ద్రోణంరాజు కల్యాణ మండపంలో జరిగింది. ఈ పోటీలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించగా.. ఉమ్మడి విశాఖలోని పలు పాఠశాలల నుంచి 200 మంది హాజరయ్యారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో శరీర బరువును బట్టి 13 విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా పీడీ, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు, సెలక్షన్ కమిటీ కన్వీనర్ ఎ.అప్పలరాజు చెప్పారు. విజేతలను చంద్రంపాలెం హైస్కూల్ పీడీ పెంటకోట రాము, రిఫరీలు బి.ఆనంద్ అభినందించారు.

ఎంపికైంది వీరే.. **బాలురు:** అండర్–25 కిలోల విభాగంలో పి.సత్యనారాయణ (గోపాలపట్నం హైస్కూల్), 41 కిలోలు ఆర్.భరద్వాజ(బీవీపీ పబ్లిక్ స్కూల్), 45 కిలోలు కేజీపీ బాలచంద్ర(శ్రీ విద్య స్కూల్), 48 కిలోలు ఎస్.మోహిత్(సెయింట్ జోసెఫ్, యలమంచిలి), 51 కిలోలు వంశీకృష్ణ(భాష్యం స్కూలు, శ్రీహరిపురం), 55 కిలోలు ఎస్.కె.రజాక్(భాష్యం), 59 కిలోలు ఒ.వాసుదేవ యాదవ్(సమతా కళాశాల), 63 కిలోలు బి.కృష్ణ చైతన్య(డీఏవీ స్కూల్, బుచ్చిరాజుపాలెం), 68 కిలోలు గుల్షన్ కుమార్(ఒక్రిడ్జి స్కూల్, తగరపువలస), అండర్– 78 కిలోల విభాగంలో ఎంసీ ఆండ్రూస్ ఎంపికయ్యారు.

బాలికలు: అండర్ 32 కిలోల విభాగంలో ఎం. గ్రేష్మ(నారాయణ కళాశాల), 35 కిలోలు ఈ.మీనా(అచ్యుతాపురం కేజీబీవీ), 42 కిలోలు ఎస్కే వహీదా బషీర్(శ్రీ చైతన్య, అనకాపల్లి), 44 కిలోలు ఎ.షర్మిల(అంజన స్కూల్, ఆరిలోవ), 46 కిలోలు సౌజన్య(యలమంచిలి హైస్కూల్), 49 కిలోలు ఆశా దీప్తి(రవీంద్ర భారతి), 55 కిలోలు డి.సుస్మిత(కొప్పప్రోలు హైస్కూల్), 59 కిలోలు యామిని దేవి(గోపాలపట్నం హైస్కూల్), 63 కిలోలే ఎస్.రూపావతి(వీఎస్ కృష్ణా కళాశాల), అండర్–68 కిలోల విభాగంలో డి.సత్యశ్రీ(అనకాపల్లి జీవీఎంసీ పాఠశాల) విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాల, బాలికలు

అండర్–14 జట్ల ఎంపికలు ప్రారంభం

మధురవాడ: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విశాఖ ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొనే అండర్–14 బాల, బాలికల జట్ల ఎంపిక శనివారం ప్రారంభమైంది. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ద్రోణంరాజు కల్యాణ మండపంలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల నుంచి 200 మంది వరకు హాజరయ్యారు. పోలీస్ మాజీ అధికారి టీఎస్ఆర్ ప్రసాద్, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో–ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, సునీల్ మహంతి, చంద్రంపాలెం పీడీ అప్పలరాజు, ఆనంద్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధుల వల్లే ఆత్మహత్యాయత్నం

పోలీసులకు వివాహిత కోమలి ఫిర్యాదు

అక్కిరెడ్డిపాలెం: మానవ హక్కుల సంఘం ప్రతినిధుల వేధింపుల వల్లే తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కోమలి అనే వివాహిత గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాధితురాలి భర్త శ్రీధర్, అతని అమ్మమ్మ అప్పల నర్సమ్మ, ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధి డాక్టర్ సంపత్ కుమార్, మరో ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. గాజువాక బస్ డిపో వద్ద గల ములగాడ హౌసింగ్ కాలనీలో ఆకుల కోమలి దేవి, ఆమె భర్త శ్రీధర్, అతని సోదరి నివాసం ఉంటున్నారు. వీరిది ప్రేమ వివాహం. వివాహ సమయంలో శ్రీధర్‌కు రూ.5లక్షల కట్నం ఇచ్చారు. శ్రీధర్ తల్లిదండ్రులు చనిపోయారు. వివాహం జరిగిన కొద్ది కాలం తర్వాత అదనపు కట్నం కోసం శ్రీధర్, అతని అమ్మమ్మ గొందేశి అప్పల నర్సమ్మ ఆమెను వేధించడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఆమె అత్త(శ్రీధర్ తల్లి) పేరిట ఉన్న 18 తులాల బంగారాన్ని కోమలికి తెలియకుండా శ్రీధర్, అప్పల నర్సమ్మ రూ.7.80 లక్షలకు లోన్ తీసుకుని.. సొంతానికి వాడుకున్నారు. తిరిగి బంగారం దొంగలించావని కోమలిని వేధింపులకు గురి చేసి, బంగారం తీసుకురమ్మని పుట్టింటికి పంపించేశారు. తర్వాత శ్రీధర్ ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధి డాక్టర్ సంపత్ కుమార్‌ను ఆశ్రయించి.. అతనితో భార్యకు ఫోన్ చేయించాడు. అతను సమతానగర్‌లోని ఆఫీస్‌కు రమ్మని చెప్పారు. ఒకవేళ రాకపోతే లాయర్ నోటీసులు పంపుతామని, శ్రీధర్‌తో విడాకులు ఇప్పిస్తామని బెదిరించారు. ఆమె వెళ్లకపోవడంతో మళ్లీ ఫోన్ చేసి.. ఆఫీస్‌కు రామ్మన్నాం గానీ హోటల్‌కు కాదు కదా అంటూ మానసిక క్షోభకు గురిచేసేలా మాట్లాడారని ఫిర్యాదులో కోమలి పేర్కొన్నారు. అక్టోబర్ 30న ముగ్గురు మహిళలు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులమని చెప్పి.. ఆమె ఇంటికి వచ్చారు. తెల్లకాగితంపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆమె అక్టోబర్ 31న కాలం చెల్లిన మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అదిరే.. అదిరే



ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శన

ఏయూక్యాంపస్: ఏయూను సందర్శిస్తున్న నాక్ బృందం గౌరవార్థం శనివారం సాయంత్రం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏయూ విద్యార్థులు సంప్రదాయ థింసా, కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. వీరికి పోటీగా విదేశీ విద్యార్థులు సైతం తమ దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నృత్య ప్రదర్శనలతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన నాక్ బృందం విద్యార్థుల ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఏయూ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లాడ్జిలో తనిఖీల్లో రూ.9.45 లక్షల స్వాధీనం

సీతమ్మధార : ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ లాడ్జిలో తనిఖీల్లో పోలీసులు రూ.9.45 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి 12.30 గంటల సమయంలో నైట్ రౌండ్‌లో ఉన్న ఏఎస్ఐ ఎస్.గంగాధర్ రెడ్డి ఆశీలమెట్టలోని పెట్రోల్ బంక్ వెనుక రోడ్డులో గల శ్రీధన లాడ్జిలో తనిఖీలు చేశారు. ఒక రూమ్‌లో ఉన్న పెదబయలు మండలం, జాముగూడ గ్రామానికి చెందిన యువకులు కిల్లో మధుబాబు, కె.భాస్కరరావును ప్రశ్నించగా సరిగా సమాధానం ఇవ్వలేదు. దీంతో వారి బ్యాగ్‌లు తనిఖీ చేయగా రూ.9,45,410 ఉండటం గమనించారు. వెంటనే ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. అలాగే వారిని అదుపులోకి తీసుకోవడంతోపాటు నగదు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో ఇద్దరిపై గంజాయి కేసులు ఉన్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.